క్లుప్తంగా

మొగలిపురంలో గౌరమ్మకు ప్రత్యేక పూజలు



అయ్యప్ప మాలధారణ భక్తులతో గౌరమ్మ సన్నిధిలో గండి రవికుమార్ తదితరులు

సబ్బవరం: మండలంలోని మొగలిపురం గ్రామం, కర్రివాని కొంపల వద్ద గౌరమ్మ కమిటీ ఆధ్వర్యంలో గౌరమ్మ సంబరాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు గండి రవికుమార్ అమ్మవారిని దర్శించుకుని, అయ్యప్ప మాల ధారణ భక్తులతో కలిసి ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం అమ్మవారి సన్నిధిలో నిర్వహించిన అన్నసమారాధనను ప్రారంభించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అన్నప్రసాదాలు స్వీకరించారు. ఆయన వెంట పార్టీ మండల యువజన విభాగం అధ్యక్షుడు యడ్ల నాయుడు, ఐడీ బాబు, ఉప సర్పంచ్ సిరపరపు వాసు, బైలపూడి మల్లునాయుడు, ఎమ్మెల్యే దేముడు, కర్రి నాగరాజు, గోతిరెడ్డి అమ్మతల్లి, గండి ముత్యాలనాయుడు, జాగరపు గోపి తదితరులు ఉన్నారు.

ధ్యానంతో చదువులో రాణింపు



విద్యార్థులకు ధ్యానంపై సూచనలిస్తున్న ధ్యాన గురువు

పెందుర్తి:ధ్యానం ద్వారా చదువులో మరింతగా రాణించవచ్చని, విద్యార్థి దశ నుంచే చదువుతో పాటు ఆటపాటలు, ధ్యానంపై దృష్టి సారించాలని పాపయ్యరాజుపాలెం పిరమిడ్ ధ్యాన కేంద్ర నిర్వాహకురాలు లక్ష్మి అన్నారు. ఇక్కడి ధ్యాన కేంద్రంలో ఆదివారం యూత్ సెషన్, టీచర్ ట్రైనింగ్ పేరిట వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిరంతర ధ్యాన ప్రక్రియ వలన శారీరక రుగ్మతలకు దూరంగా ఉండడంతో పాటు మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు. ఉపాధ్యాయులు తమ వృత్తిని ప్రశాంతంగా నిర్వహించేందుకు ధ్యానం ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు. యూత్ సెషన్ సీనియర్‌లు ధార్మిక, ఉష, లలిత, భవ్య విద్యార్థులకు పలు అంశాలపై మెలకువలు నేర్పారు. చదువులో ఉన్నత స్థితికి చేరుకోవడానికి శూన్యస్థితి, లక్ష్యం, శ్రద్ధ, ఏకాగ్రత, పట్టుదల, ఆత్మవిశ్వాసం, క్షమాగుణం వంటి అంశాలపై పట్టు సాధించాలని చెప్పారు. మాంసాహారం, జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండాలని సూచించారు. నిర్వాహకులు, ధ్యాన మాస్టర్లు పాల్గొన్నారు.

వాహనం ఢీకొని వృద్ధురాలి మృతి



గుర్తు తెలియని వృద్ధురాలి మృతదేహం

పరవాడ: అనకాపల్లి–గాజువాక జాతీయ రహదారిలో తాడి మూడు మదుంల కారు ఢీకొన్న ఘటనలో గుర్తు తెలియని వృద్ధురాలు(60) మృతి చెందింది. పరవాడ సీఐ ఆర్. మల్లికార్జునరావు తెలిపిన వివరాలు. జాతీయ రహదారిని ఆనుకుని తాడి మూడు మదుంల వద్ద శనివారం రాత్రి 8.30 గంటల సమయంలో రోడ్డు దాటుతున్న గుర్తు తెలియని ఓ వృద్ధురాలిని గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆమె తలకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడ్డ ఆమెను చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో కేజీహెచ్‌కు తరలించగా అక్కడ మృతి చెందింది. ప్రమాద సమాచారాన్ని తాడి వీఆర్వో కేవీ రమణ ద్వారా అందుకున్న పరవాడ సీఐ మల్లికార్జునరావు కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారు. మృతురాలి సమాచారం తెలిసిన వ్యక్తులు పరవాడ పోలీసులను సంప్రదించాల్సిందిగా సీఐ కోరారు.

పౌర్ణమి ప్రదక్షిణలకు గ్రహణం

ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం.. సింహాద్రి అప్పన్న. సాధారణంగా భక్తులు ఏ గుడికి వెళ్లినా ముందుగా ఆలయం చుట్టూ కనీసం ముమ్మారు ప్రదక్షిణ చేసి, ఆ తర్వాతే మూలవిరాట్‌ను దర్శించుకుంటారు. సింహాచలేశుని సన్నిధిలో కూడా గతంలో ఆ అవకాశం ఉండేది. ప్రతి నెలా పౌర్ణమి రోజున దీన్ని ఎంతో ఘనంగా నిర్వహించేవారు. అధికారుల నిర్లక్ష్యం, వైదికుల నిర్లిప్తత వెరసి పౌర్ణమి ప్రదక్షిణలకు గ్రహణం పట్టింది. ఓ గ్రహణం రోజున నిలిపేసిన ప్రదక్షిణలను మళ్లీ ఎప్పుడు ప్రారంభిస్తారంటూ భక్తులు ఆరా తీస్తున్నారు.



పౌర్ణమి రోజుల్లో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు(ఫైల్)

- 2008లో వైభవంగా పౌర్ణమి ప్రదక్షిణలు ప్రారంభం
- గిరిప్రదక్షిణ చేయలేని వారికి ఇదో వెసులుబాటు
- ఆరేళ్లుగా పట్టించుకోని అధికారులు
- అప్పన్న గుడి చుట్టూ పౌర్ణమి ప్రదక్షిణల కోసం భక్తుల విన్నపం



సింహగిరిపైనున్న శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ప్రధాన ఆలయం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి కొలువైన సింహగిరి చుట్టూ ప్రదక్షిణ చేసేందుకు నగరవ్యాప్తంగా 32 కిలోమీటర్లు నడవాలి. ఏటా ఆషాఢ చతుర్దశి రోజు గిరిప్రదక్షిణ మహోత్సవం పెద్ద ఎత్తున జరుగుతుంది. అలా చేస్తే భూ ప్రదక్షిణ ఫలం చేకూరుతుందని భక్తుల నమ్మకం. అందుకే ఆ రోజు లక్షల మంది భక్తులు కొండచుట్టూ తిరిగి, స్వామిపై తమ భక్తిని చాటుకుంటారు. అంత దూరం గిరిప్రదక్షిణ చేయలేని వారి కోసం వైదికులు ఆషాఢ పౌర్ణమి రోజుల్లో ఆలయ ప్రదక్షిణ అవకాశాన్ని కల్పించారు. వరుసగా మూడేళ్లపాటు ఆషాఢ పౌర్ణమి రోజున 108 సార్లు ప్రదక్షిణ చేసినా, గిరి ప్రదక్షిణ పుణ్యం దక్కుతుందని భక్తుల నమ్మకం.

వైభవంగా పౌర్ణమి ప్రదక్షిణలు ప్రారంభం

వరుసగా మూడేళ్లపాటు స్వామివారి గుడి చుట్టూ ప్రదక్షిణ చేయాలనుకునే వారికి మధ్యలో ఏదైనా అవాంతరం ఏర్పడితే మరో ఏడాది వరకు ఎదురు చూడాల్సి వచ్చేది. మరోవైపు వయసుమళ్లిన వారు, కొందరు మహిళలు ఒకే సారి 108 ప్రదక్షిణలు చేయడానికి ఇబ్బంది పడేవారు. దీంతో ఆషాఢ పౌర్ణమి అనే కాకుండా ప్రతి పౌర్ణమి నాడూ స్వామివారి గుడిచుట్టూ ప్రదక్షిణలు చేసే కార్యక్రమానికి 2008 శ్రావణ పౌర్ణమి రోజున శ్రీకారం చుట్టారు. ఏడాదిలో వచ్చే 12 పౌర్ణమి రోజుల్లో, ప్రతి పౌర్ణమినాడు 32 ప్రదక్షిణల చొప్పున భక్తులు గుడిచుట్టూ తిరిగేవారు. ఇందుకోసం గుడి చుట్టూ కాలిబాటపై కార్పెట్ వేసి, భక్తులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు. అయితే ఈ కార్యక్రమాన్ని రెండుమూడేళ్లే కొనసాగించారు. ఓ పౌర్ణమి రోజున వచ్చిన గ్రహణాన్ని సాకుగా చూపి దీన్ని మరుగునపెట్టేశారు.

భక్తుల ఒత్తిడితో పునఃప్రారంభం.. ఆపై రద్దు

పౌర్ణమి ప్రదక్షిణలకు ఉదయం నుంచే భక్తులు తరలి వచ్చేవారు. సాయం కాలం నిండు చంద్రుడు **పున్నమి వెన్నెలు** ప్రసరించే వేళలో సింహాచలం పరి**సర గ్రామాల** ప్రజలు ఎక్కువగా ఈ అవకాశాన్ని **వినియోగించుకు**నేవారు. ప్రదక్షిణల అనంతరం **స్వామివారి దర్శ**నం చేసుకుని, ఆనందంగా తిరుగుముఖంపట్టేవారు. అయితే 2011లో పౌర్ణమి ప్రదక్షిణలను నిలిపేశారు. తొలుత సౌకర్యాలు, ఏర్పాట్లలో అలసత్వం వహించారు. చివరికి పూర్తిగా ప్రదక్షిణలనే నిలిపేశారు. భక్తుల నుంచి విమర్శలు వెల్లువెత్తడం మొదలయింది. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో 2013లో పౌర్ణమి ప్రదక్షిణలను పునఃప్రారంభించారు. ఈసారైనా పూర్తిస్థాయిలో వీటిపై దృష్టిపెడతారనుకుంటే అదీ జరగలేదు. భక్తులే తమ ఏర్పాట్లు తాము చేసుకుని, స్వామి గుడి చుట్టూ ప్రదక్షిణలు చేసేవారు. చివరికి 2018లో ప్రదక్షిణలకు బ్రేక్ ఇచ్చారు. అప్పటి నుంచి ఇప్పటి వరకూ మళ్లీ ఆ ఊసే లేదు. ప్రస్తుతం ప్రతీ పౌర్ణమి ప్రదక్షిణల విషయం అధికారులకు అసలు గుర్తే లేనట్టుంది. ఇప్పటికైనా దేవస్థానం అధికార, వైదిక వర్గాలు పౌర్ణమి ఆలయ ప్రదక్షిణలని పునరుద్ధరించి, అందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని భక్తులు కోరుతున్నారు.

ఐదారేళ్ల కిందట చేశా..



నేను ఐదారేళ్ల క్రిందట పౌర్ణమిరోజున గుడిచుట్టూ ప్రదక్షిణలు చేశా. సాయంత్రం వేళల్లో గుడిచుట్టూ ప్రదక్షిణలు చేసి, స్వామిని దర్శించుకుంటే కలిగే అనుభూతే వేరు. మళ్లీ చేద్దామంటే ప్రస్తుతం పౌర్ణమి ప్రదక్షిణలు నిలిపేసినట్లు తెలిసింది. దేవస్థానం అధికారులు మళ్లీ ఆ కార్యక్రమాన్ని ప్రారంభించాలి.

– ప్రవీణ, సింహాచలం

ఎంతో గొప్ప కార్యక్రమం



ప్రతి పౌర్ణమికి శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయ ప్రదక్షిణ చేసుకునే కార్యక్రమం ఎంతో గొప్పది. 2013లో రెండోసారి మొదలెట్టిన సమయంలో ఈ కార్యక్రమంలో పాల్గొన్నా. అప్పట్లో చాలామంది భక్తులు పౌర్ణమి ప్రదక్షిణలు చేసేవారు.అలాంటి కార్యక్రమాన్ని నిలిపేయడం సరికాదు. దీన్ని పునరుద్ధరించాలి.

– కుమారి, సింహాచలం

అధికారులు దృష్టి సారించాలి



ప్రతీ పౌర్ణమికి ఆలయ ప్రదక్షిణ చేసే కార్యక్రమంపై చిన్నచూపు తగదు. స్వామిని మొక్కుకుని, మొక్కులు తీర్చుకునేందుకు ఎంతో మంది భక్తులు పౌర్ణమి రోజుల్లో స్వామివారి సన్నిధికి చేరేవారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసేవారు. చాలా సందడిగా ఉండేది. ఇప్పటికైనా అధికారులు దీనిపై దృష్టిసారించాలి.

– భవాని, గోపాలపట్నం

శిథిల వంతెనతో అవస్థలు



రక్షణ గోడలు లేని ముత్యాలమ్మపాలెం వంతెన

పరవాడ: శిథిలావస్థకు చేరిన వంతెనతో ప్రమాదాల బారిన పడుతున్నామని ముత్యాలమ్మపాలెం గ్రామ మత్స్యకార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాడచీపురుపల్లి–ముత్యాలమ్మపాలెం రహదారిలో ముత్యమాంబ ఆలయం సమీపంలో కొన్నేళ్ల క్రితం నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరింది. వంతెనకు రెండు వైపులా ఏర్పాటు చేసిన రక్షణ గోడలు కూలిపోయాయి. దీంతో రాత్రి సమయంలో రాకపోకలు సాగించే ప్రయాణికులు అదుపు తప్పి ప్రమాదాలకు గురవుతున్నారు. వంతెన కూడా పెచ్చులూడిపోయి ఇనుప చువ్వలు దర్శనమిస్తున్నాయి. వంతెన పరిస్థితి ప్రమాదకర స్థాయికి చేరడంతో ప్రయాణికులు బితుకు బితుకు మంటూ రాకపోకలు సాగిస్తున్నారు. పాడైన వంతెనను తొలగించి నూతన వంతెన నిర్మాణానికి అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

వీఆర్వోల సంఘం మాజీ అధ్యక్షుడు సత్యం మృతి



బలిరెడ్డి సత్యం(ఫైల్)

సబ్బవరం: మండలంలోని ఇరువాడ గ్రామానికి చెందిన మండల వీఆర్వోల సంఘం మాజీ అధ్యక్షుడు బలిరెడ్డి సత్యం(80) అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం మరణించారు. ఆయన ఇరువాడ కరణం, మునసబు, గ్రామ పరిపాలన అధికారి(వీఏవో), వీఆర్వోగా పలు ఉద్యోగ బాధ్యతలను నిర్వహించారు. పదవీ విరమణ చేసేంతవరకూ సబ్బవరం వీఆర్వోల సంఘం అధ్యక్షుడిగా పనిచేశారు. అనారోగ్యం కారణంగా ఆయన విశాఖలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ఐదు రోజులుగా చికిత్స పొందుతూ, ఇంటికి తీసుకొచ్చాక మరణించారు. ఆయనకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. స్వగ్రామంలో సోమవారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు



నిత్యకల్యాణంలో అప్పన్న ఉత్సవమూర్తులు



గరుడసేవ నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణపుష్పార్చన వైభవంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణమండపంలో వేదికపై అధిష్టింపజేశారు. 108 స్వర్ణ సంపెంగ పుష్పాలతో స్వామికి అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. పూజలో పాల్గొన్న ఉభయదాతలకు శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

ఘనంగా నిత్యకల్యాణం

స్వామివారికి ఉదయం 9.30 గంటల నుంచి నిత్యకల్యాణం ఘనంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను కొలువుంచి, విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, అక్షింతలు, శేషవస్త్రాలను అందజేశారు.

శాస్త్రోక్తంగా గరుడసేవ

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గరుడసేవ శాస్త్రోక్తంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో గరుడవాహనంపై స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని వేంజేపచేశారు. అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు. స్వామివారి ప్రసాదాన్ని అందించారు.

రోడ్డు బాగు చేయరూ..



చింతలగ్రహారం వంతెన వద్ద అధ్వానంగా మారిన పినగాడి-వేపగుంట రోడ్డు

పెందుర్తి: పినగాడి–వేపగుంట–సింహాచలం రహదారి అధ్వానంగా తయారైంది. ముఖ్యంగా పినగాడి కూడలి నుంచి వేపగుంట కూడలి వరకు రోడ్డు పూర్తిగా ఛిద్రమైంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఈ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరైనా కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా పనులు జరగలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు రెండు రోజుల్లో పనులు ప్రారంభిస్తామని చెప్పినా.. అతీ గతీ లేదు. చింతలగ్రహారం రైల్వే వంతెన నుంచి వేపగుంట కూడలి వరకు రోడ్డు నిర్మాణానికి జీవీఎంసీ నిధులు మంజూరు చేసినా ఈ రోడ్డు మా పరిధిలోనిది అంటూ ఆర్ అండ్ బీ అధికారులు ఇటీవల మోకాలడ్డారు. దీంతో పనులు జరగక, ఈ రోడ్డు మీదుగా ప్రయాణం చేస్తున్న వాహన చోదకులు నరకం చూస్తున్నారు. గోతుల కారణంగా నిత్యం ప్రమాదాలు జరగడంతో బెంబేలెత్తిపోతున్నారు. ప్రభుత్వం స్పందించి రోడ్డును బాగుచేయాలని ప్రజలు కోరుతున్నారు.

మల్లికార్జునస్వామి ఆలయ సంప్రోక్షణ



మల్లికార్జున స్వామికి పూజలు చేస్తున్న అర్చకులు



సంప్రోక్షణ కోసం కలశాల ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

పెందుర్తి: ప్రశాంతినగర్‌లో కొలువుదీరిన స్వయంభూ లింగాల మల్లికార్జున స్వామి దేవాలయ సంప్రోక్షణ కార్యక్రమాన్ని ఆదివారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేంకటాద్రి ప్రధాన అర్చకుడు మహర్షి రామానుజాచార్యుల ఆధ్వర్యంలో మల్లికార్జున స్వామికి విశేష అభిషేకాలు జరిపారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా పెందుర్తి ఆంజనేయ స్వామి ఆలయం నుంచి మల్లికార్జున స్వామి ఆలయం వరకు 108 కలశాలతో భక్తులు భారీ ఊరేగింపు చేశారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు. ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ మల్లికార్జునరావు, ప్రతినిధులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పెరిగిన తుప్పలు.. రాకపోకలకు తిప్పలు



తిక్కవానిపాలెం రహదారికి ఇరువైపులా ఏపుగా పెరిగిన తుప్పలు

పరవాడ: వాడచీపురుపల్లి–తిక్కవానిపాలెం రహదారికి ఇరువైపులాదట్టంగా పెరిగిన తుప్పలతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నట్లు సమీప ప్రాంతాల ప్రయాణికులు వాపోతున్నారు. సుమారు నాలుగు కిలోమీటర్ల నిడివి కలిగిన తిక్కవానిపాలెం రహదారికి ఇరువైపుల దట్టంగా తుప్పలు పెరిగాయి. ఈ రహదారిలో మలుపులు ఎక్కువ. ఈ మలుపుల వద్ద ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించక ప్రమాదాలకు గురవుతున్నట్లు ప్రయాణికులు చెప్తున్నారు. తీరానికి రాకపోకలు సాగించే సందర్శకులు తరచూ ఇబ్బందులు పడుతున్నారు. రహదారికి ఇరువైపులా ఏపుగా పెరిగిన తుప్పలను తొలగించేలా పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



చింతలగ్రహారం జెడ్పీ హైస్కూల్లో 2004-05 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు, అప్పటి గురువులు

పెందుర్తి: వారంతా దాదాపు రెండు దశాబ్దాల క్రితం (2004–05) చింతలగ్రహారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి కలిసి చదువుకున్నారు. కొందరు అక్కడితో చదువు ఆపేస్తే, చాలా మంది ఉన్నత విద్యకు ఇతర ప్రాంతాలకు వెళ్లారు. అక్కడి నుంచి వివిధ వృత్తుల్లో స్థిరపడ్డారు. ఆదివారం వీరంతా కలుసుకుని తమ స్కూల్ డేస్‌ను గుర్తు చేసుకున్నారు. ఈ అపూర్వ సమ్మేళనానికి చింతలగ్రహారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వేదికయింది. ఒకరినొకరు పలకరించుకుంటూ, ఆటపాటలతో సందడి చేశారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన అలనాటి గురువులను పిలిచి ఘనంగా సత్కరించి, వారి ఆశీస్సులు అందుకున్నారు. మధ్యాహ్నం సహపంక్తి భోజనాలు చేశారు. పాత జ్ఞాపకాలు నెమరువేసుకున్నారు. తీపి గురుతులను సెల్ ఫోన్లలో భద్రపరచుకుని, ఆనందంగా వీడ్కోలు పలికారు.

కడుపు నొప్పి తాళలేక గృహిణి ఆత్మహత్య

పెందుర్తి: కడుపు నొప్పి తాళలేక ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన పెందుర్తిలో చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. పెందుర్తికి చెందిన కుదార జ్యోతి(24)కి గాజువాకలో నివాసం ఉంటున్న సాయికుమార్‌తో నాలుగేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు ఆడపిల్లలు. జ్యోతి తరచూ కడునొప్పితో బాధపడేది. అనారోగ్యంతో ఉన్న తల్లిని చూసేందుకు రెండు రోజుల క్రితం జ్యోతి పెందుర్తి వచ్చింది. ఆదివారం తీవ్ర కడుపు నొప్పి రావడంతో, భరించలేక ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు ఫిర్యాదులో పేర్కొన్నారు. పెందుర్తి పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని జ్యోతి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. సీఐ కె.వి.సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు జరుగుతోంది.

ఐస్‌బాల్ హాకీ పోటీలకు పెందుర్తి క్రీడాకారులు



జాతీయ పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో సీఐ సతీష్‌కుమార్

పెందుర్తి: జాతీయ ఐస్ బాల్ హాకీ పోటీలకు సుజాతనగర్, పెందుర్తి ప్రాంతాలకు చెందిన 60 మంది క్రీడాకారులు ఎంపికయ్యారు. రాష్ట్ర బాండీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సుజాతనగర్‌లో క్రీడాకారుల ఎంపిక కోసం క్యాంప్ నిర్వహించారు. ఈ క్యాంప్‌లో 100 మంది క్రీడాకారులు పాల్గొనగా, అందులో ప్రతిభ కనబరిచిన 60 మంది క్రీడాకారులు ఎంపికైనట్లు సీనియర్ కోచ్ పి.మురళి మీడియాకు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను పెందుర్తి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.వి.సతీష్‌కుమార్ ప్రత్యేకంగా అభినందించారు. నిర్వాహకులకు క్రీడాకారులకు ప్రత్యేక మెడల్స్ అందించారు. కార్యక్రమంలో సుజాతనగర్ అసోసియేషన్ కార్యదర్శి డి.ఎస్.మూర్తి, వ్యాపారవేత్త ఎస్.రవికుమార్, తిలక్, నరసింహం, బాండీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి.ఎం.లక్ష్మీకుమారి, తెలంగాణ ప్రధాన కార్యదర్శి ఎండీ నసీరుద్దీన్, కోచ్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా సబ్బవరం–లంకెలపాలెం రోడ్డు



పైడివాడ అగ్రహారం వద్ద సబ్బవరం-లంకెలపాలెం రోడ్డు దుస్థితి

సబ్బవరం: మండలంలోని సబ్బవరం–లంకెలపాలెం రోడ్డు అడుగడుగునా భారీ గోతులు ఏర్పడి, ప్రమాదకరంగా మారింది. దీంతో ఈ రోడ్డులో రాకపోకలు సాగించే భారీ వాహనాలు గోతుల్లో పడి బ్రేక్ డౌన్ అవుతున్నాయి. పరవాడలోని ఎన్టీపీసీతో పాటు పలు పరిశ్రమలకు చెందిన భారీ వాహనాలు సబ్బవరం మీదుగా ముడి సరకులు, తయారైన ఉత్పత్తులు తరలిస్తూ ఈ రోడ్డు మీదుగానే రాకపోకలు సాగిస్తుంటాయి. మరోవైపు ఫ్లైయాష్ తరలించే లోడ్ లారీల నుంచి ఫ్లైయాష్ పడి, బీటీ రోడ్డు అధ్వానంగా మారింది. ద్విచక్ర వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్డుపై ఏర్పడిన గోతుల్ని తాత్కాలికంగానైనా మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

సాగరతీరంలో సండే సందడి



తీరంలో సందడి చేస్తున్న సందర్శకులు

పరవాడ: గాజువాక, సబ్బవరం, అనకాపల్లి, పరవాడ ప్రాంతాల నుంచి ఆదివారం తరలివచ్చిన సందర్శకులు తిక్కవానిపాలెం, ముత్యాలమ్మపాలెం తీర ప్రాంతాల్లో సందడి చేశారు.ఆదివారంఉదయం తీరాలకు చేరుకున్న సందర్శకులు తీరం అందాలను ఆస్వాదిస్తూ, ఇసుక తిన్నెలపై కబడ్డీ, క్రికెట్, వాలీబాల్ వంటి ఆటలు, పాటలతో ఉత్సాహంగా గడిపారు. సాయంసంధ్య వేళ వరకు జలకాలాటలతో ఉల్లాసంగా గడిపి, ఇళ్లకు తిరుగుముఖం పట్టారు.